క్లుప్తంగా

1 నుంచి దుకాణాల ద్వారా రేషన్ పంపిణీ


మాట్లాడుతున్న తహసీల్దారు రమేష్‌బాబు

కర్నూలు(రూరల్): వచ్చే నెల 1 నుంచి రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ చేయనున్నట్లు కర్నూలు రూరల్ తహసీల్దారు టీవీ రమేష్ బాబు తెలిపారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ ఇప్పటి వరకు వాహనాల ద్వార ఇళ్ల వద్దకే రేషన్ పంపిణీ చేశామన్నారు. ఇక నుంచి కార్డుదారులు రేషన్ దుకాణాలకు వచ్చి రేషన్ తీసుకోవాలని సూచించారు. రేషన్ దుకాణాలు రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు తెరచి ఉండాలన్నారు. 65 ఏళ్లు పైబడిన వారికి, విభిన్న ప్రతిభావంతులకు ఇంటి వద్దే రేషన్ పంపిణీ జరుగుతుందన్నారు.

కంబదహాల్లో రేషన్ షాప్ తనిఖీ


రేషన్ షాప్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం

సి.బెళగల్: మండల పరిధిలోని కంబదహాల్ గ్రామంలోని రేషన్ షాప్‌ను ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం తనిఖీ చేశారు. మంగళవారం ఆయన గ్రామానికి చేరుకుని షాప్ నెంబర్ 10లో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన డీలర్‌తో మాట్లాడుతూ వచ్చే నెల ఒకటో తేది నుంచి రేషన్ సరుకులను షాప్ దగ్గర పంపిణీ చేయాలన్నారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంకాలం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ పంపిణీ జరగాలన్నారు. ఈ నిబంధనలు పాటించని డీలర్లపై చర్యలుంటాయని ఆయన హెచ్చరించారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో ఎల్లమ్మమాత

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని వెంకాయపల్లె గ్రామ సమీపంలో వెలసిన ఎల్లమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమావాస్య కావడంతో ముందుగా అమ్మవారి ఆలయాన్ని శుద్ధి చేశారు. అనంతరం భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

రోడ్డు ఇలా.. వెళ్లేదెలా?


సి.బెళగల్ ప్రధాన రోడ్డులో వెళ్లేందుకు అవస్థ పడుతున్న వాహనదారుడు

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్లోని ప్రధాన రోడ్డు చినుక పడితే చిత్తడిగా మారుతుంది. దీంతో ఈ మార్గంలో ప్రజలు, వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం దగ్గర ఎమ్మిగనూరు – గూడూరు ప్రధాన రోడ్డుపై మోకాళ్లలోతు నీటి మడుగు ఏర్పడ్డాయి. మండల టీడీపీ నాయకులు ఈ గోతులను పూడ్చేందుకు రోడ్డుపై ఎర్రమట్టి కుప్పలు పోసి వదిలేశారు. దీంతో సోమవారం కురిసిన వానకు రోడ్డు మొత్తం బురదమయంగా మారిపోవడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. కింద పడతామనే భయంతో కొందరు ద్విచక్రాలను తోసుకుంటూ వెళ్లారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఎమర్జెన్సీ మెడిసిన్ సేవలు కీలకం


క్యాజువాలిటీలో కేక్ కట్ చేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రిలో అత్యవసర వైద్యం కోసం వచ్చే రోగులకు ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం వైద్యులు ప్రధానమని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు చెప్పారు. మంగళవారం ఎమర్జెన్సీ మెడిసిన్ డే సందర్భంగా ఆసుపత్రిలోని ఆ విభాగం (క్యాజువాలిటీ)లో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రికి వచ్చే రోగులకు ప్రతిరోజూ 24 గంటల పాటు ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం వారు అందిస్తున్న సేవలు అమూల్యమైనవని, ఎంతో మంది ప్రాణాలు కాపాడటంలో వారి పాత్ర ముఖ్యమని అన్నారు. అత్యవసర పరిస్థితులు వచ్చినప్పుడు, రోగులకు తక్షణ వైద్యసహాయం అందించేందుకు వైద్యులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు. వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులకు గ్రహణం

- అర్ధాంతరంగా నిలిచిన అదనపు గదుల నిర్మాణం
- ప్రభుత్వం నిధులివ్వకపోవడంతో సాగని పనులు
- ఈ ఏడాది కూడా తప్పని గదుల కొరత
- త్వరలో తెరచుకోనున్న పాఠశాలలు


కొణిదేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిలిచిన అదనపు గదుల నిర్మాణం

పాణ్యం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి రంగం పూర్తిగా నిర్వీర్యం అయ్యింది. ప్రతి పేదవాడికి ఉన్నత విద్య అందించేందుకు గత ప్రభుత్వం నాడు–నేడు పథకాన్ని ప్రవేశపెట్టి ప్రభుత్వ బడులను ఆదర్శంగా తీర్చిదిద్దింది. అయితే కూటమి ప్రభుత్వం పేదలకు ఉన్నత విద్య అందకుండా కక్షగట్టింది. పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న అదనపు గదుల నిర్మాణం, అభివృద్ధి పనులను పూర్తి చేయకుండా విద్యార్థులకు మరిన్ని ఇబ్బందులను సృష్టిస్తుంది. దీంతో పాలన చేపట్టి ఏడాది గడిచినా ఎక్కడి పనులు అక్కడే అన్నట్లుగా మొండి గోడలతో అసంపూర్తి భవనాలు వెక్కిరిస్తున్నాయి.

మండలంలో మొత్తం 46 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. గత ప్రభుత్వ పాలనలో నాడు–నేడు మొదటి, రెండవ దఫాల్లో అన్ని పాఠశాలలకు నూతన హంగులు తెచ్చారు. అలాగే మూడవ దఫాలో అదనపు గదులు నిర్మించేందుకు నిధులు మంజూరు చేయగా పనులు ప్రారంభమయ్యాయి. ఈలోగా ఎన్నికల కోడ్ ప్రారంభం కావడం, ఆ తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ పనులన్నీ ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. తర్వాత ఏడాది గడిచినా పనుల్లో ఎలాంటి పురోగతి లేకుండా పోయింది.

నాడు దేశానికే ఆదర్శంగా ప్రభుత్వ బడులు

2019–24 మధ్య కాలంలో గత ప్రభుత్వం విద్యా వ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణలతో రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు దేశానికే ఆదర్శంగా నిలిచాయి. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా బడులను తీర్చిదిద్ది అత్యాధునిక వసతులతో కూడిన విద్యను ప్రతి పేద విద్యార్థికి అందేలా చేశారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్‌ఈ, ఐబీ సెలబస్‌ను ప్రవేశపెట్టి అందరి చూపు ఏపీ వైపు అనేలా విద్యాబోధన అందించారు. విద్యతో పాటు తరగతి గదుల్లో నూతన బెంచీలు, ఐఎఫ్‌పీ బోర్డులు, ఫర్నిచర్, కంప్యూటర్లు, పౌష్టికాహారం, ఆర్‌ఓ ప్లాంట్ తదితర వాటిని అందించి పేదల మన్ననలు పొందారు.

పెండింగ్ పనులకు నిధులివ్వని కూటమి ప్రభుత్వం

గతేడాది ఎన్నికల అనంతరం పాలన చేపట్టిన కూటమి ప్రభుత్వం పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న నాడు–నేడు పనులపై ఎలాంటి సమీక్ష చేయలేదు. నిధులు విడుదల చేయకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే అన్నట్లు మధ్యలోనే నిలిచిపోయాయి. ఏడాది దాటినా పెండింగ్ పనులను పట్టించుకోకపోవడంతో అసంపూర్తిగా ఉన్న భవనాల్లో కంప చెట్లు మొలిచి మొండి గోడలు వెక్కిరిస్తున్నాయి. ఏడాది నుంచి పనులు జరగక చేపట్టిన నిర్మాణాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. దీంతో ఈ ఏడాది కూడా విద్యార్థులకు కష్టాలు తప్పేలా లేవు.

ముందుకు సాగని పనులు

గత ప్రభుత్వంలో మండలంలో నాడు–నేడు మొదటి విడతలో 18 పాఠశాలలు ఎంపిక కాగా రూ.2.57 కోట్లతో అభివృద్ధి పనులు చేశారు. అలాగే పాణ్యం ప్రభుత్వ పాఠశాలకు నాబార్డు నిధులు రూ.కోటి మంజూరు చేయగా అదనపు గదులు నిర్మించారు. అలాగే నాడు – నేడు రెండవ దఫా కింద రూ.4.33 కోట్లతో ఆయా పాఠశాలలో రిపేర్లు, ఇతర ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పనులు చేపట్టారు. అలాగే అదనపు గదుల నిర్మాణం కోసం కొణిదేడు పాఠశాలకు రూ.48.97 లక్షలు, కేజీబీకి రూ.36.94 లక్షలు, ఆలమూరు పాఠశాలకు 12.75 లక్షలు, గోరుకల్లు పాఠశాలకు 45.62 లక్షలు చొప్పున నిధుల కేటాయించారు. ఈ పనులు పునాదులకే పరిమితమయ్యాయి. కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.


ఆలమూరులో అర్ధాంతరంగా ఆగిన పనులు


గోరుకల్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆగిన పనులు

పనులు ప్రారంభిస్తాం

మండలంలోని పాఠశాలల్లో పెండింగ్ పనులపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పనులు త్వరగా పూర్తిచేయాలని కోరాం. నిధులు మంజూరైన వెంటనే పనులను తిరిగి ప్రారంభించి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఇబ్బంది లేకుండా చూస్తాం. – కోటయ్య, ఎంఈఓ

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి

పాణ్యం: ప్రతి గ్రామంలో జూన్ 1 నుంచి రేషన్ సరుకుల పంపిణీ సక్రమంగా చేపట్టాలని తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, సీఎస్ డీటీ ప్రసాద్ సూచించారు. ఈ మేరకు మంగళవారం రెవెన్యూ కార్యాలయంలో డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రేషన్ షాపుల వద్ద కార్డుదారులకు మంచినీరుతో పాటు ఇతర సౌకర్యాలు సమకూర్చాలన్నారు. వృద్ధులు, వికలాంగుల ఇళ్ల వద్దకే డీలర్లు వెళ్లి సరుకులు అందించాలన్నారు. కార్డుదారులకు బియ్యం, చక్కెర, కందిపప్పు అందిస్తున్నట్లు తెలిపారు. 1వ తేదీలోగా కార్డులకు సంబంధించి అథరైజేషన్ పూర్తి చేసుకోవాలన్నారు. అనంతరం కార్డుల వివరాలు, సరుకుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ తహసీల్దార్ శివశంకర్‌రెడ్డి, ఆర్ఐ రామ్, డీలర్లు పాల్గొన్నారు.

మూల్యాంకనానికి ఏర్పాట్లు

కర్నూలు సిటీ: ఈ నెల 19వ తేదీ నుంచి మొదలైన పదో తరగతి సప్లమెంటరీ ప్రధాన పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. మైనర్ మీడియంకు చెందిన పరీక్ష బుధవారం జరగనుంది. పరీక్షలు ముగియడంతో మూల్యాంకనానికి ప్రభుత్వ పరీక్షల విభాగం ఏర్పాట్లు చేస్తోంది. సప్లమెంటరీ పరీక్షలకు సంబంధించిన సమాధాన పత్రాలు జిల్లాకు సుమారుగా 20 వేలు రానున్నాయి. ఈ నెల 31, జూన్ 1, 2 తేదీల్లో మూల్యాంకనం జరుగనుంది. ప్రస్తుతం పేపర్ కోడింగ్ జరుగుతోంది.

గిరిజన గ్రామాల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా/హాజరైన అధికారులు

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో ధర్తీ అబా జన్‌జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ కింద ఎంపికైన ఏడు గ్రామాల్లో అభివృద్ధి పనులను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పథకం అమలుపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 500 లేదా అంతకంటే ఎక్కువ జనాభా కలిగి అందులో కనీసం 50 శాతం గిరిజనులు నివాసం ఉంటే ఆ గ్రామంలో ధర్తీ అబా జన్‌జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్‌ను అమలుచేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జిల్లాలో మంత్రాలయం మండలం పరమాన్‌దొడ్డి, నెరణికి, హోళగుంద మండలంలోని హోళగుంద, కోగిలతోట, మద్దికెర మండలంలోని పెరవళి, మద్దికెర (తూర్పు), హంప గ్రామాలను ఎంపిక చేసినట్లు వివరించారు. గిరిజన వర్గాల సామాజిక–ఆర్థిక పరిస్థితులను మెరుగు పరచేందుకే కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఎంపికైన గ్రామాల్లో 17 శాఖల ద్వారా వ్యక్తిగత, కమ్యూనిటీ స్థాయిలో ఇళ్లు, రోడ్లు, మౌలిక వసతుల కల్పన, వైద్యం, పోషకాహారం, విద్య, శిక్షణ, విద్యుదీకరణ, కనెక్టివిటీ తదితర సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకుకుంటున్నట్లు చెప్పారు. జూన్ 15వ తేదీ నుంచి ఈ పథకాన్ని అమలుచేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి తులసిదేవి, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, హౌసింగ్ పీడీ చిరంజీవి, డీఏఓ వరలక్ష్మీ, డీఈఓ శామ్యూల్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

శిశుగృహ చిన్నారుల సంరక్షణపై శ్రద్ధ చూపండి

కర్నూలు(అర్బన్): శిశు గృహ కేంద్రంలోని చిన్నారులను సొంత పిల్లల్లా చూసుకుంటూ, వారిని కుటుంబ వాతావరణంలో పెంచాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సూచించారు. ఆయన మంగళవారం స్థానిక సీ క్యాంప్‌లోని శిశు గృహ కేంద్రాన్ని తనిఖీ చేశారు. గృహం అంతా కలియతిరిగి ఉన్న సదుపాయాలు, పరిసరాలను పరిశీలించారు. లివింగ్ రూమ్, ఫీడింగ్ రూమ్, వంట గది, ఆఫీస్ రూమ్, టాయిలెట్స్, కంప్యూటర్ గదులను పరిశీలించి చిన్నారులకు డైరీ మిల్క్ చాక్లెట్లను అందించారు. గృహంలో ఎంత మంది చిన్నారులు ఉన్నారు, ప్రతి రోజు డాక్టర్లు పిల్లలను పరీక్షిస్తున్నారా? వారికి పాలు, ఇతర సంరక్షణ ఎలా ఉందని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అలాగే శిశు గృహం ప్రారంభమైనప్పటి నుంచి ఎంత మంది పిల్లలు ఉన్నారు, ఇప్పటి వరకు ఎంత మందిని దత్తత ఇచ్చారు? పిల్లలను చూసుకునేందుకు రాత్రి సమయాల్లో ఎవరు ఉంటారని ఇన్‌చార్జ్ మేనేజర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఇన్‌చార్జ్ మేనేజర్ మెహతాజ్‌బేగం స్పందిస్తూ 2006లో కేంద్రం ప్రారంభమైందని, ఇప్పటి వరకు 132 మందిని దత్తత ఇచ్చినట్లు తెలిపారు. అందులో ఇతర దేశాలకు 17 మందిని దత్తత ఇచ్చినట్లు కలెక్టర్‌కు వివరించారు. ప్రస్తుతం ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి మాత్రమే ఉన్నారని, ఒక అమ్మాయి మాట్లాడేందుకు ఇబ్బంది పడుతోందని అధికారులు చెప్పగా, వెంటనే స్పీచ్ థెరపీ చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. పిల్లల విషయంలో ఎలాంటి తప్పులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. శిశు గృహ కేంద్రంలో ప్రస్తుతం ఉన్న పిల్లలను దత్తత ఇచ్చేందుకు ఆన్‌లైన్ పోర్టల్‌లో వారి డేటాను ఎంట్రీ చేశారా? దత్తత తీసుకున్న వారు పిల్లలను ఏ విధంగా చూసుకుంటున్నారో ఫాలో అప్ చేస్తున్నారా, అని ప్రశ్నించారు. కేంద్రంలో డ్రైనేజీ సమస్య ఉందని, ఫ్లోరింగ్ బాగా లేదని, భవనానికి పెయింటింగ్, మరమ్మతులు చేయించాలని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ పనులకు సంబంధించి ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈతో మాట్లాడి ఎస్టిమేట్స్ పంపాలని ఐసీడీఎస్ పీడీని ఆదేశించారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ఐసీడీఎస్ పీడీ పి.నిర్మల, జిల్లా బాలల సంరక్షణ అధికారిణి శారద తదితరులు ఉన్నారు.


శిశు గృహలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

● అధ్వానంగా రోడ్డు

గడివేముల: మండలంలోని కొన్ని గ్రామాలకు వెళ్లాలంటే అధ్వానంగా ఉన్న రోడ్లలో ప్రయాణం చేసేందుకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండల పరిధిలోని పెసరవాయి గ్రామానికి వెళ్లే రహదారిలో ఆత్మకూరు వద్ద నిర్మిస్తున్న రోడ్డుకు కంకరను తరలించే భారీ వాహనాలు వెళ్లడంతో రోడ్డు పూర్తిగా దెబ్బతింది. దీంతో అత్యవసర సమయాల్లో 108, అంబులెన్స్ తదితర వాహనాలు వెళ్లాలంటే నానా అవస్థలు పడుతున్నారు. వర్షాలు కురిస్తే గోతుల్లో నీరు చేరి వాహన చోదకులు, పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నిత్యం ఈ రహదారిలో వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు.


గడివేముల-పెసరవాయి రహదారిలో దెబ్బతిన్న రోడ్డు

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


కాటసాని రాంభూపాల్‌రెడ్డిని శాలువాతో సత్కరిస్తున్న పార్టీ నాయకులు

కల్లూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో వివిధ విభాగాల్లో పదవులు పొందిన వారు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సూచించారు. వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన జెట్టి ప్రభుదాస్, గడివేముల మండల కమిటీలో నియమితులైన మంగే నాయక్, పి.అంజన్ నాయక్ మంగళవారం కాటసాని రాంభూపాల్ రెడ్డిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. పార్టీలో కష్టపడి పని చేసిన వారికి తప్పనిసరిగా పదవులు వరిస్తాయన్నారు. రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం, మండల, ఇతర స్థాయిలో పదవులు పొందిన నాయకులందరూ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా పని చేయాలన్నారు. అందరినీ కలుపుకొని పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఎ.హనుమంతురెడ్డి, గడివేముల వైస్ ఎంపీపీ బి.కాలునాయక్, తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో చాంపియన్‌గా కర్నూలు


విజేతలకు మెడల్స్ అందజేసిన సీఈఓ విజయ్‌కుమార్

కర్నూలు (టౌన్): స్థానిక కిడ్స్ వరల్డ్‌లోని రోశయ్య హాలులో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో చాంపియన్‌గా కర్నూలు జట్టు నిలిచింది. విజేతలకు మంగళవారం బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఒలింపిక్ సంఘం సీఈఓ విజయ్‌కుమార్, అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాసులు, తైక్వాండో సంఘం ఇన్‌చార్జ్ సతీష్‌కుమార్ పాల్గొని పతకాలు అందజేశారు. చాంపియన్‌గా నిలిచిన కర్నూలు తైక్వాండో క్రీడాకారులకు బంగారు, రజత పతకాలు, రెండవ స్థానంలో నంద్యాల క్రీడాకారులు, మూడవ స్థానంలో ఎమ్మిగనూరు క్రీడాకారులు నిలిచారు. వారికి నిర్వాహకులు ట్రోఫీలు అందజేసి అభినందించారు. తైక్వాండో శిక్షకులు వీరేష్‌బాబు, శివన్న, ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టండి


సర్పంచ్ పద్మావతమ్మతో కలిసి మొక్కను నాటుతున్న డీపీఓ జి.భాస్కర్

కల్లూరు: జిల్లాలోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు పక్కాగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి జి.భాస్కర్ డిప్యూటీ ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. కల్లూరు మండలంలో మోడల్ విలేజ్‌గా ఎంపికైన పెద్దటేకూరులో మంగళవారం డీపీఓ పర్యటించారు. ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి నీళ్లు పోశారు. గ్రామంలో మూడు రోజుల పాటు పారిశుద్ధ్య పనుల ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని డీపీఓ అధికారులకు సూచించారు. వ్యర్థరహిత గ్రామంగా తీర్చిదిద్దడమే కార్యక్రమ ఉద్దేశమన్నారు. గ్రామంలో అన్ని వీధులను శుభ్రంగా ఉంచాలని డిప్యూటీ ఎంపీడీఓ నాగేష్, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. పారిశుద్ధ్యం లోపిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్పంచ్ పద్మావతమ్మ, పలువురు డిప్యూటీ ఎంపీడీఓలు, డీపీఆర్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యకర జీవనం


యోగా శిక్షణలో పాల్గొన్న ట్రైనర్‌లు

కర్నూలు(రూరల్): యోగాతో ఆరోగ్యకర జీవనం సిద్ధిస్తుందని, దీనిని ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని కర్నూలు జెడ్పీ సీఈఓ నాసర రెడి అన్నారు. మంగళవారం కర్నూలు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో యోగాపై ట్రైనింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. యోగాంధ్ర -2025 కార్యక్రమం జూన్ 21 వరకు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి శిక్షకులు షెడ్యూల్ ప్రకారం హాజరై విజయవంతం చేయాలన్నారు. యోగా గొప్పతనాన్ని ప్రతి కుటుంబానికి, ప్రతి వ్యక్తికి చేరవేయాలని ఉద్యోగులకు సూచించారు. కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అధికారి రఘునాథ్, పరిపాలన అధికారి జీవీ చంద్రశేఖర్ రెడ్డి, కర్నూలు మండల యోగా ట్రైనర్లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కోడుమూరు రూరల్: ప్రతి రోజు యోగా చేయడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చునని కోడుమూరు ఎంపీడీఓ రాముడు చెప్పారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం కోడుమూరులో యోగాపై శిక్షణ నిర్వహించారు. అనంతరం పట్టణంలో యోగా వల్ల కలిగే ప్రయోజనాలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 27 నుంచి 31వ తేదీ వరకు యోగాపై గ్రామ సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. శిక్షణనంతరం జూన్ 3నుంచి 6వతేదీ వరకు సిబ్బంది ఆయా గ్రామాల్లో ప్రజలకు శిక్షణ ఇస్తారన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ మంజుల, ఈఓ అజయ్‌భాస్కర్, పంచాయతీ కార్యదర్శులు, గ్రామసచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరులో..

యోగాంధ్రలో భాగంగా గూడూరులోని హైస్కూల్‌లో మంగళవారం యోగా కార్యక్రమాలపై ఎంపీడీఓ శివనాగప్రసాద్ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బందికి, గ్రామ సచివాలయ సిబ్బంది అవగాహన కల్పించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ సిబ్బంది అంతా యోగాసనాలను చక్కగా నేర్చుకుని గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

యోగా శిక్షణ

పాణ్యం: మండల కేంద్రంలోని శ్రీకృష్ణ కల్యాణ మండపంలో మంగళవారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, ఎంఈఓ-2 సుబ్రమణ్యం ఆధ్వర్యంలో యోగాపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వచ్చే నెల 21న ప్రపంచ యోగా దినోత్సవం పురస్కరించుకొని ప్రతి గ్రామం నుంచి ప్రతి ఒక్కరు యోగా చేసేలా సచివాలయాల పరిధిలో ఉన్న వారికి శిక్షణ ఇస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరు యోగా దినోత్సవం రోజున నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం పదిలం

కల్లూరు: యోగాతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఎంపీడీఓ నాగేశేషాచలరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో మంగళవారం యోగా శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామ సచివాలయాల్లో షెడ్యూల్ ప్రకారం యోగ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. యోగా వల్ల మానసిక ప్రశాంతత ఉంటుందన్నారు. మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, యోగా ట్రైనర్స్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా యోగాపై శిక్షణ

సి.బెళగల్: మండల స్థాయి యోగా శిక్షణ కార్యక్రమాన్ని మండల పరిషత్ కార్యాలయ అధికారులు బురదలోనే నిర్వహించడంతో సచివాలయ ఉద్యోగులు అవస్థలు పడ్డారు. అధికారులు కనీస ఏర్పాట్లు చేయకుండా స్థానిక భార్గవరాయల్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ ఆవరణలో నేలపై శిక్షణ ఇచ్చారు. కనీసం టార్పాలిన్ పట్టాలను సైతం అధికారులు ఏర్పాటు చేయలేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీడీఓ రాణెమ్మ ఆధ్వర్యంలో ఉదయం పది గంటలకు ప్రారంభం కాలవాల్సిన ఈ శిక్షణ కార్యక్రమం 11:20 గంటల తర్వాత ప్రారంభించారు.


కోడుమూరులో యోగాపై ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది


సి. బెళగల్లో ఆరుబయట బురదలో ఉద్యోగులకు యోగాపై శిక్షణ ఇస్తున్న దృశ్యం


శిక్షకులతో కలిసి యోగాసనాలు చేస్తున్న జెడ్పీ సీఈవో నాసర రెడ్డి


యోగా చేస్తున్న అధికారులు

యోగా శిక్షణను సద్వినియోగం చేసుకోండి

గడివేముల: యోగా శిక్షణ తరగతులను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వాసుదేవ గుప్తా మంగళవారం సూచించారు. ఈ నెల 28 తేదీ నుంచి 31వ తేదీ వరకు మండల కేంద్రంలోని రాజరాజేశ్వరీ ఉన్నత పాఠశాలలో యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి ఆయా సచివాలయాల నుంచి 200 మందిని ట్రైనర్లుగా ఎంపిక చేశామన్నారు. వీరికి ముందుగా జిల్లాస్థాయిలో శిక్షణ పొందిన గడివేముల పీహెచ్‌సీ డాక్టర్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వడం జరగుతుందన్నారు. యోగాలో పాల్గొనే వారు ఆయా గ్రామాల్లోని సచివాలయాలలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఆర్‌యూ సీనియర్ అసిస్టెంట్‌కు మెమో

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ హాస్టల్ ఆఫీస్‌లో విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్ ఎమ్.మాలిక్ అహ్మద్‌కు మంగళవారం మెమో ఇచ్చారు. వంశీ అనే విద్యార్థితో ఫోన్‌లో కులం పేరుతో దూషిస్తూ అసభ్యంగా మాట్లాడినట్లు సంభాషణలు విన్న వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బోయ విజయకుమార్ నాయుడు మెమో జారీ చేశారు. ఈనెల 29వ తేదీలోగా వివరణ ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వివరణ ఇవ్వని పక్షంలో క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.